
సాక్షి
తూర్పుగోదావరి

గురువారం । 11 । ఏప్రిల్ । 2024



రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న ఆలయంలో వకుళమాత అన్నదాన భవనానికి బడే రవికుమార్, రామ సత్యవేణి దంపతులు (పొడగట్లపల్లి) రూ.లక్ష విరాళం ఇచ్చారు.



కాలువలకు 7,050 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాలువలకు 7,050 క్యూసెక్కుల నీటిని వదిలారు. తూర్పు డెల్టాకు 2,000, మధ్య డెల్టాకు 1,550, పశ్చిమ డెల్టాకు 3,500 క్యూసెక్కులు వదిలారు.

ఈద్ ముబారక్



పవిత్ర రంజాన్ మాసం ముగిసింది. షవ్వాల్ నెల ప్రారంభ సూచికగా బుధవారం చంద్ర దర్శనంతో ముస్లింలు ఈద్ నమాజ్‌కు సిద్ధమయ్యారు. గురువారం ఈద్ ఉల్ ఫితర్ పండగకు ఏర్పాట్లు చేసుకున్నారు.

II లో

న్యూస్‌రీల్

టోఫెల్ ప్రైమరీ పరీక్ష ప్రశాంతం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టోఫెల్ ప్రాథమిక పరీక్ష అర్బన్‌లో ప్రశాంతంగా జరిగిందని రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎస్ నారాయణ బుధవారం తెలిపారు. ఎంపిక చేసిన 24 పాఠశాలల్లో మొత్తం 2,327 మంది టోఫెల్ పరీక్ష రాశారన్నారు. టోఫెల్ (టెస్ట్ ఆఫ ఇంగ్లిష్ యాజ్ ఏ ఫారెన్ లాంగ్వేజ్) టెస్ట్‌లో రెండు భాగాలుంటాయన్నారు. వాటిలో రీడింగ్, ఆడియో క్లిప్పింగ్ విద్యార్థులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్ బోర్డ్, స్మార్ట్ టీవీలు, టీచర్ టాబ్‌లలోకి పరీక్ష రోజు ఉదయం పంపిస్తారన్నారు. ఆ ఆడియో క్లిప్స్ విని ప్రశ్నకు జవాబులు ఓఎమ్ఆర్ షీట్‌లో బబ్లింగ్ చేయాలన్నారు. విద్యార్థుల పూర్తి చేసిన ఓఎమ్ఆర్‌లను జాగ్రత్తగా ప్యాక్ చేసి స్టోరేజ్ పాయింట్‌లో అందజేయాలన్నారు. ఆడియో పరీక్షను రెండు నిమిషాల వీడియోగా తీసి సంబంధిత సీఆర్పీలకు పంపించాలన్నారు. 12వ తేదీ శుక్రవారం టోఫెల్ జూనియర్ పరీక్ష 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు అర్బన్ లో 39 సెంటర్లలో జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు దాదాపు 9,700 మంది హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ఓల్డ్ టౌన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని తులసి, మేదరపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని మాధవీలత, సీఆర్పీ జె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొట్టిలంక చెక్ పోస్ట్ ఆకస్మిక తనిఖీ



పొట్టిలంక చెక్‌పోస్టు సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్

కడియం: చెక్ పోస్టుల వద్ద విధులను నిర్వర్తించే వివిధ శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత స్పష్టం చేశారు. బుధవారం మధ్యాహ్నం కడియం మండలం పొట్టిలంక చెక్ పోస్ట్‌ను ఎస్పీ పి.జగదీష్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు కచ్చితంగా పాటించడంలో చెక్‌పోస్టుల వద్ద విధులను నిర్వర్తించే అధికారులు, సిబ్బంది జవాబుదారీ తనం కలిగి ఉండాలన్నారు. చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహించే క్రమంలో ప్రతి ఒక్క అంశం రికార్డు చేయాలన్నారు. రిజిస్టర్‌లో ఆయా వివరాలు కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. పోలీస్, ఎక్సైజ్, కమర్షియల్ ట్యాక్స్, రెవెన్యూ, అటవీ శాఖ ఇతర శాఖల చెక్‌పోస్ట్‌లో బాధ్యతలు నిర్వహించే వారి మధ్య సమన్వయం సాధించడం అత్యంత కీలకం అన్నారు. ఇప్పటి వరకు ఈ చెక్‌పోస్ట్ వద్ద రూ.లక్ష 40 వేలను సీజ్ చేసినట్టు చెక్ పోస్ట్ సిబ్బంది వివరాలు అందచేశారు. విధుల్లో సమయ పాలన కచ్చితంగా పాటించాలన్నారు. ప్రతి తనిఖీ వివరాలు తప్పనిసరిగా వీడియో రికార్డింగ్ చేయాలని ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. తనిఖీల సందర్భంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. స్నేహ పూర్వక విధానంలో బాధ్యతలు చేపట్టాలన్నారు. అనంతరం చెక్ పోస్ట్ వద్ద నిర్వహిస్తున్న మూడు షిఫ్టుల సిబ్బంది హాజరు, రికార్డుల నిర్వహణను పరిశీలించి, తగిన సూచనలు చేశామన్నారు.

తప్పుడు రికార్డులను సమర్పిస్తే కఠిన చర్యలు

కలెక్టర్ డాక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం రూరల్: ఎన్నికల విధుల్లో మినహాయింపుల విషయంలో తప్పుడు రికార్డులను సమర్పిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలకు సిఫారసు చేస్తామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత హెచ్చరించారు. బుధవారం వివిధ కారణాల రీత్యా ఎన్నికల విధులు నిర్వహించే బాధ్యత నుంచి మినహాయింపులు కోరుతూ పలువురు ఉద్యోగులు కలక్టరేట్‌లో దరఖాస్తులను సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లడుతూ, ఉద్యోగులు ఎన్నికల విధులను పవిత్రమైన బాధ్యతగా భావించాలని కోరారు. ఇప్పటికే దీర్ఘకాలికంగా సెలవులో ఉన్న వారు సంబంధిత డ్రాయింగ్ అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం అందజేయాలని ఆదేశించారు.

సక్రమంగా అఫిడవిట్

నామినేషన్ల ప్రక్రియలో నామినేషన్ల పత్రాలు, అఫిడవిట్ దాఖలు చేసే విధానంలో అభ్యర్థులు జాగ్రత్తగా వ్యవహరించాలని , ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు పాటించాలని కలెక్టర్ మాధవీలత స్పష్టం చేశారు. బుధవారం తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈనెల 12న పార్లమెంటుకి చెందిన, 13న అసెంబ్లీ నియోజక వర్గాల బ్యాలెట్ యూనిట్స్ తొలి ర్యాండమైజేషన్ చేపట్టనున్నట్లు తెలిపారు.

జగన్‌ను గెలిపించేందుకు...
జనం సిద్ధం

- ఓటు అడిగే హక్కు టీడీపీకి లేదు
- సుశిక్షితులైన సైనికులుగా పార్టీ విజయానికి పనిచేయాలి
- వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, ఎంపీ సుభాష్ చంద్రబోస్
- సభకు పోటెత్తిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



సభలో మాట్లాడుతున్న ఎంపీ సుభాష్ చంద్రబోస్



సభలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్



సభలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: సంక్షేమమే పరమావధిగా ఐదేళ్లుగా సేవలు అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మేమంతా సిద్ధం సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలసికట్టుగా పోరాటం సాగిస్తే విజయం తథ్యమన్నారు. రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంపీ మార్గాని భరత్‌రామ్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు సుశిక్షితులైన సైనికుల్లా పనిచేయాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అభ్యర్థుల విషయంలో బహిరంగంగా ఎక్కడా వ్యతిరేకంగా మాట్లాడే ప్రయత్నాలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. లోక్‌సభ అభ్యర్థి శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌రామ్‌లను అత్యధిక భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ గుర్తు చేసేలా కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 25 లోక్‌సభ, 175 అసెంబ్లీ స్థానాలు గెలుపే లక్ష్యంగా మనమంతా కృషి చేయాలన్నారు.

ఓటు అడిగే హక్కు భరత్‌కే ఉంది

రాజమహేంద్రవరం నగరానికి చెందిన పార్టీ నాయకులు, వివిధ విభాగాల నాయకులు సుమారు 3,000 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి అంటే భరత్..భరత్ అంటే అభివృద్ధి అని నగరంలో ఓటు అడిగే హక్కు ఒక్క భరత్ కే ఉందని, టీడీపీకి లేనే లేదని ముక్తకంఠంతో స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికలలో పార్లమెంట్, సిటీ నియోజకవర్గాలలో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని, గెలుపు కోసం కాకుండా అత్యధిక మెజారిటీ కోసమే కష్టపడుతున్నామని ప్రకటించారు. ఎంపీ భరత్‌రామ్ వల్లే నగరం సర్వాంగ సుందరంగా తయారైందని, ప్రతిపక్ష నేతలే ఈ విషయాన్ని అంగీకరించి భరత్ రామ్‌ను అభినందించారనే విషయాన్ని గుర్తు చేసుకున్నారు.

రాజకీయ దొంగలకు బుద్ధి చెప్పాలి

ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకుని తీరా గెలిచాక పట్టించుకోని వారంతా రాజకీయ దొంగలని, వారికి త్వరలో జరగనున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గతంలో ఇక్కడ ఒకే కుటుంబం నుంచి మేయర్‌గా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా 16 సంవత్సరాల పాటు రాజకీయ పదవులు అనుభవించి, నగరానికి ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదన్నారు. దశాబ్దన్నర కాలం అభివృద్ధిని కుంటుపరిచి నగరాన్ని భ్రష్టుపట్టించారని ధ్వజమెత్తారు. 2014లో టీడీపీ ఎంపీగా మురళీమోహన్, 2019లో సిటీ ఎమ్మెల్యేగా ఆదిరెడ్డి భవానీ నగరానికి చేసిన ఒక్క మంచిపని కూడా లేదన్నారు. ఇప్పుడు మళ్లీ ఎమ్మెల్యే భవానీ భర్త ఓటు వేయమని ప్రజల వద్దకు వచ్చి కాళ్లా వేళ్లా పడుతున్నాడని అన్నారు. కరోనా సమయంలో ప్రజలంతా అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపితే ప్రాణాలను కూడా లెక్క చేయకుండా ప్రజల కోసం అహోరాత్రులు శ్రమించి పనిచేశామన్నారు. నగరంలో మోరంపూడి జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, కంబాల చెరువు అభివృద్ధి, గ్లో గార్డెన్, ఈట్ స్ట్రీట్, హ్యాపీ స్ట్రీట్, ప్రధాన జంక్షన్ల అభివృద్ధి, దేవీ చౌక్ నుంచి లాలాచెరువు వరకూ ప్రధాన రహదారిని స్మార్ట్ రోడ్డుగా అభివృద్ధి చేశామన్నారు. విమానాశ్రయం అభివృద్ధి పనులకు రూ.370 కోట్లు, ఇంటి గ్రేటెడ్ రైల్వే స్టేషనుగా అభివృద్ధికి రూ.260 కోట్లు, ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి అనుమతి తీసుకుని వచ్చానన్నారు. నగరంలో 40 వేల నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలిచ్చి ఒక చరిత్ర సృష్టించామన్నారు. అభివృద్ధి పనులు చేయలేని టీడీపీ నేతలకు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. నగరంలో జరిగిన అభివృద్ధిపై టీడీపీ నేతలు ఎప్పుడైనా ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధం కావాలన్నారు. ఆదిరెడ్డి వాసుకు బుకాయింపు, బెదిరింపులు తప్పిస్తే మరింకేమీ చేతకాదన్నారు. సింగిల్‌గా జగనన్నను ఎదుర్కొనే సత్తా లేక బీజేపీ, జనసేన, టీడీపీ కలిసి గుంపులు గుంపులుగా వస్తున్నారని ఎద్దేవా చేశారు.

సీఎం జగన్ చేసిన సంక్షేమాన్ని అందరికీ తెలపాలి

రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరికం తగ్గించిన మహనీయుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పేదలకు విద్యను అందించాలనే లక్ష్యంతో పనిచేసిన నాయకుడు ఆయనేనన్నారు. రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు పెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. పేదల సంక్షేమానికి కృషి చేసే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మనమంతా కాపాడుకోవాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రతీ రోజూ పది మందికి తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, గాండ్ల, తెలుకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిస భవానీప్రియ, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, పార్టీ అబ్జర్వర్ రావిపాటి రామచంద్రరావు, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, నందెపు శ్రీనివాస్ మాజీ కార్పొరేటర్లు, వివిధ విభాగాల చైర్మన్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సభకు హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

గోరంట్ల వారి డిటో డిటో!

- టీడీపీ అధినేత వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో కాపీ కొడితే..
- బుచ్చయ్య వైఎస్సార్ సీపీ అభ్యర్థి వేణును అనుకరిస్తున్నారు



డివిజన్‌లో బాలాజీపేటలో పర్యటిస్తున్న గోరంట్ల బుచ్చయ్యచౌదరి

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఎదుటివారు చేసే మంచిని తమ ఖాతాలో వేసుకోవడం .. చేతిలో ఉన్న మీడియాతో అదే ఎదుటివారిపై బురదజల్లడంలో టీడీపీ నాయకులు ఆరితేరిపోయారు. నిన్న మొన్నటి వరకు వలంటీర్లపై, సీఎం వైఎస్ జగన్‌ చేస్తున్న సంక్షేమ పథకాలపై టీడీపీ అధినేత విమర్శలు చేస్తుండేవారు. తీరా ప్రజల వైఖరి అర్థమయ్యాక వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోనే కాపీకొట్టి ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. అదే బాటలో రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి నడుస్తున్నారు. చెత్త మంత్రి అంటూ చెల్లుబోయిన వేణును విమర్శించిన బుచ్చయ్యచౌదరి వేణు బాటలోనే నడుస్తూ ఇటీవల చెత్త ఊడ్చేందుకు తయారయ్యారు. ఇప్పుడు మరో కార్యక్రమాన్ని కూడా కాపీ కొట్టేస్తూ.. గుడ్‌మార్నింగ్ మీ ఇంటికి మీ గోరంట్ల అంటూ వార్డుల్లో పర్యటన మొదలు పెట్టారు. బుధవారం నగరపాలక సంస్థ పరిధిలో 16వ డివిజన్ బాలాజీపేట, ఆదర్శనగర్‌లలో ఇంటింటికీ వెళ్లి ప్రజాసమస్యలు తెలుసుకుంటూ, సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. అచ్చంగా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణు చేసిన మాదిరిగానే గడపగడపకూ తిరుగుతున్నారు. మంత్రి చేసిన పనులను విమర్శించిన గోరంట్ల ఇప్పుడు తిరిగి వేణునే అనుసరిస్తూ ఎన్నికల ప్రచారానికి రావడంపై నియోజకవర్గ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

రోడ్డు, ఇంటి భద్రతపై అవగాహన

పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ జగదీష్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ జగదీష్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రోడ్డు భద్రత...ఇంటి భద్రతలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగివుండాలని ఎస్పీ పి.జగదీష్ అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆటోడ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ స్వయంగా ఆటోలకు అవగాహన పోస్టర్లను అతికించారు. ముందుగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు, ఇంటి భద్రతలకు సంబంధించి ఐదువేల పోస్టర్లు, హోర్డింగ్స్ రాజమహేంద్రవరం పట్టణ పరిసర ప్రాంతాలు, హైవేలపై జిల్లా అంతటా ప్రజలకు అవగాహన కోసం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని, ఆ నియమాలు పాటించకపోవడం వల్ల ప్రతి ఏడాది చాలామంది మృత్యువాత పడుతున్నారని చెప్పారు. కేవలం ప్రజల్లో ఈ విషయమై అవగాహన లేకపోవడం వల్లనే ఈ మరణాలు సంభవిస్తున్నాయన్నారు.

ఎల్‌హెచ్ఎంఎస్ ఉపయోగించుకోండి

జిల్లావ్యాప్తంగా దొంగతనాలను నివారించడానికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం (లాక్ హౌస్ మోనిటరింగ్ సిస్టం)ను ఉపయోగించుకోవాలని, ఇది పూర్తి ఉచితమన్నారు. జిల్లా ప్రజలు పోలీసు సేవలను వినియోగించుకొని తమ విలువైన సామగ్రిని క్షేమంగా ఉంచుకోవాలన్నారు. వేరే ప్రాంతాలకు వెళ్లినప్పుడు 9493206371, 9908454580 ఫోన్ నంబర్లలో సంప్రదించి లాక్‌హౌస్ మోనిటరింగ్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు, డయల్ 112కు తెలియజేయాలన్నారు. అడిషనల్ ఎస్పీలు ఎస్ఆర్.రాజశేఖర్‌రాజు, టి.సర్కార్, ఎల్.చింబిరెడ్డి, జోనల్ డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది, 1,000 మందిపైగా ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కౌంట్‌డౌన్ ప్రారంభం

- ఎన్నికల నోటిఫికేషన్‌కు ఏడు రోజులే గడువు
- జారీ అయిన రోజు నుంచే నామినేషన్ ప్రక్రియ
- అభ్యర్థులు నియమావళి పాటించాల్సిందే
- పకడ్బందీ కసరత్తు చేస్తున్న జిల్లా అధికారులు



కలెక్టరేట్

కాకినాడ సిటీ: కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఎన్నికల షెడ్యూల మేరకు ఈ నెల 18న సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. గత నెల 16వ తేదీ షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. కోడ్‌ను పటిష్టంగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీకి పకడ్బందీగా కసరత్తు చేస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్, జాయింట్ కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఎన్నికల కసరత్తును పకడ్బందీగా పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు కింది స్థాయి అధికారులకు సూచనలిస్తున్నారు. నోటిఫికేషన్ జారీ అయినప్పటి నుంచే ఎన్నికల ప్రధాన ఘట్టం మొదలు కానుంది.

18 నుంచే నామినేషన్ ప్రక్రియ

జిల్లాలో కాకినాడ లోక్‌సభ నియోజకవర్గంతో పాటు, మిగిలిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నామినేషన్ ప్రక్రియ ఈ నెల 18 నుంచే ప్రారంభం కానుంది. కాననాడ లోక్‌సభ స్థానానికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ ఆర్వోగా కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లోను, అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆయా ఆర్వోలు పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్‌లు స్వీకరిస్తారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నియమావళిని, నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. ఎన్నికల్లో పోటీ చేసే వారికి ఉండాల్సిన అర్హతలపై ఎన్నికల కమిషన్ దిశా నిర్దేశం చేసింది. అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసేందుకు సువిధ యాప్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చింది.

నామినేషన్ దాఖలు

- నామినేషన్‌ను సువిధ యాప్ ద్వారా దాఖలు చేసిన తర్వాత హార్డ్ కాపీలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేసే క్రమంలో చాంబర్‌లోకి అభ్యర్థితో పాటు ఐదుగురిని మాత్రమే అనుమతిస్తారు.
- అభ్యర్థులు తమ బి-ఫారమ్, ఎ-ఫారమ్ ఒరిజినల్ అందించాలి. వీటిని నామినేషన్ గడువు ముగిసే రోజు మధ్యాహ్నం మూడు గంటల్లోపు అందజేయవచ్చు.
- అభ్యర్థులు రెండు (ఒకటి స్టాంప్ సైజ్, మరొకటి పాస్‌పోర్టు సైజ్) ఫొటోలను నామినేషన్‌తో పాటు అందజేయాలి. అభ్యర్థి తన ఓటరు కార్డు, బలపరిచే వారి గుర్తింపు పత్రాలు ఇవ్వాలి.
- ఓ అభ్యర్థి గరిష్టంగా నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చు.
- నామినేషన్ దాఖలు చేసే సమయంలో ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రతిజ్ఞ తప్పనిసరిగా చేయాలి. ప్రతిజ్ఞ చేసిన ధ్రువీకరణ పత్రాలన్నీ తీసుకోవాలి.
- ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అభ్యర్థి తన సంతకం ఉండే విధానాన్ని విధిగా తెలియజేయాలి. అదే విధంగా బ్యాలెట్ యూనిట్‌లో తన పేరు ఎలా ముద్రించాలో వివరించి చెప్పాలి.
- అభ్యర్థి చెల్లించిన ధరావత్తుకు సంబంధించి రసీదుతో పాటు, ఎన్నికల ఖర్చును నమోదు చేసేందుకు నిర్దేశిత నమూనాలో ఉన్న రిజిస్టర్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి తీసుకోవాలి.
- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై ఏవైనా క్రిమినల్ కేసులుంటే, వాటిని మూడు దినపత్రికల్లో ప్రకటన ద్వారా బహిర్గతం చేయాలి. అందుకు అయ్యే ఖర్చును లెక్క చూపాలి.
- ఎన్నికల నామినేషన్ కేంద్రంలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. అభ్యర్థులు తమ సందేహాలను అక్కడ నివృత్తి చేసుకోవచ్చు.
- అన్ని పత్రాలను సువిధ అప్లికేషన్ (యాప్) ద్వారానే అందజేయాలి. ప్రచారానికి సంబంధించిన కార్యక్రమాలు, వాహనాలు, ఇతర వాటికి ఈ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకుంటేనే అనుమతి ఇస్తారు.

అందుబాటులో అఫిడవిట్

- అభ్యర్థులకు సంబంధించిన అఫిడవిట్‌ను అందరికీ తెలిసేలా అందుబాటులో ఉంచుతారు. ప్రజలు కోరితే వాటిని ఉచితంగానే అందజేస్తారు. ఆన్‌లైన్‌లోనూ ఇవి అందుబాటులో ఉంటాయి.
- ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల అనంతరం ఆ రోజు వచ్చిన నామినేషన్లపై అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ఎన్నికల కమిషన్‌కు తెలియజేస్తారు.
- నామినేషన్లను, అఫిడవిట్లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లోనూ, నోటీసు బోర్డులోనూ పరిశీలనకు ఉంచుతారు..
- నామినేషన్ల దాఖలు పారదర్శకంగా ఉండేందుకు ప్రక్రియను సంపూర్ణంగా వీడియో తీయిస్తారు.

పోటీ చేసే అభ్యర్థుల అర్హతలు ఇవే..

- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి తప్పనిసరిగా భారతదేశ పౌరుడు అయి ఉండాలి. నామినేషన్ దాఖలు చేసే సమయానికి 25 ఏళ్లు పూర్తయి ఉండాలి.
- రాష్ట్రంలో ఏదైనా ఓ నియోజకవర్గంలో ఓటరుగా నమోదై ఉండాలి.
- పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థులైతే నలుగురు, స్వతంత్రంగా పోటీ చేసే అభ్యర్థులను 10 మంది ఓటర్లు బలపర్చాలి. బలపరిచే వారు అదే నియోజకవర్గానికి చెందిన ఓటర్లు అయి ఉండాలి.
- ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సాధారణ కేటగిరీ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ. 5 వేలు డిపాజిట్ చెల్లించాలి.
- ఎంపీగా పోటీ చేసేందుకు సాధారణ కేటగిరీ అభ్యర్థులు రూ.25 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12,500 డిపాజిట్ చెల్లించాలి.
- నామినేషన్ దాఖలు చేయడానికి 48 గంటలకు ముందు అభ్యర్థులు తప్పనిసరిగా తమ పేరిట ఏదైనా గుర్తింపు పొందిన బ్యాంకులో ఖాతా తెరవాలి. ఆ ఖాతా ద్వారానే తమ ఎన్నికల ప్రచారానికీ, ఇతర అవసరాలకు వెచ్చించిన సొమ్ముకు సంబంధించిన లావాదేవీలు నిర్వహించాలి. ఖాతా పుస్తకం ప్రతిని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఇవ్వాలి.
- ఫారం-2 బీలో నామినేషన్ పత్రం దాఖలు చేయాల్సి ఉంటుంది.
- నామినేషన్ దాఖలు చేసే సమయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నోటరీతో కూడిన అఫిడవిట్ సమర్పించాలి. అందులో అభ్యర్థి, అతని కుటుంబ సభ్యుల స్థిర, చర ఆస్తుల వివరాలను చూపించాలి. అదే విధంగా కేసుల వివరాలు క్రైం నంబర్‌తో సహా పొందుపర్చాలి.
- అఫిడవిట్‌లోని అన్ని ఖాళీలను తప్పనిసరిగా పూరించి సమగ్ర వివరాలను నమోదు చేయాలి.
- ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ప్రభుత్వ ఉద్యోగి తన ఉద్యోగానికి రాజీనామా చేయాలి. రాజీనామాను ఆమోదించినట్లుగా ప్రభుత్వం జారీ చేసిన ధ్రువీకరణ పత్రాన్ని నామినేషన్‌తో పాటు దాఖలు చేయాలి.
- అభ్యర్థులు ఇంటి, నీటి పన్ను, విద్యుత్ చార్జీ బిల్లు బకాయిలు లేనట్లు ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి.

క్లుప్తంగా

రూ. 4.04 కోట్ల విలువైన నగదు, మద్యం స్వాధీనం

కాకినాడ సిటీ: ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఎలక్షన్ సీజుర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎస్ఎంఎస్) ద్వారా మార్చి 16 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకూ జిల్లాలో జరిపిన తనిఖీల్లో రూ.4,04 కోట్ల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులు సీజ్ చేసినట్లు కలెక్టర్ జె.నివాస్ బుధవారం రాత్రి తెలిపారు. వీటిలో రూ.54.17 లక్షల నగదు, రూ.1,13,74,000 విలువైన 1,34,011 లీటర్ల మద్యం, రూ.13.40 లక్షల విలువైన 2,26,213 గ్రాముల మాదక ద్రవ్యాలు, రూ.1.91 కోట్ల విలువ గల 118 గ్రాముల వెండి, బంగారం, రూ.31.29 లక్షల విలువైన సామగ్రిని ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్ టీములు సీజ్ చేశాయన్నారు.

రోప్ స్కిప్పింగ్‌లో యామిని సత్తా

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): బోపాల్‌లో ఇటీవల నిర్వహించిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ రోప్ స్కిప్పింగ్ జాతీయ చాంపియన్‌షిప్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థిని ఎ.యామినీ దేవి వెండి పతకం సాధించిందని కందుకూరి రాజ్యలక్ష్మి స్త్రీల కళాశాల పీడీ వై.సుధారాణి తెలిపారు. భీమవరం డీఎన్ఆర్ కాలేజీలో నిర్వహించిన ఇంటర్ కొలాజియేట్ రోప్ స్కిప్పింగ్ సింగిల్ టచ్ పోటీల్లో ఎం.నాగదేవి, ఎ.యామినీ దేవి జాతీయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. వారిలో యామినీ దేవి ద్వితీయ స్థానంలో నిలిచిందని తెలిపారు. విజేతను కళాశాల ప్రిన్సిపాల్ పి.రాఘవ కుమారి, అధ్యాపకులు అభినందించారు.

రైలు నుంచి జారిపడి మహిళ మృతి

తుని: అన్నవరం - రావికంపాడు రైల్వేస్టేషన్ల మధ్యలో రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని మహిళ (సుమారు 60 ఏళ్లు) బుధవారం మృతి చెందింది. ఆమె సుమారు ఐదు అడుగుల ఎత్తు ఉంది. పచ్చ రంగు చీర ధరించింది. మృతురాలి వివరాలు తెలియలేదని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జీఆర్పీ ఇన్‌చార్జి ఎస్సై లోవరాజు తెలిపారు.

ఈద్ ముబారక్

- నేడు ఈద్ ఉల్ ఫితర్
- బుధవారం ఇఫ్తార్‌తో ముగిసిన ఉపవాసాలు
- రంజాన్ పండగకు పూర్తయిన ఏర్పాట్లు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం)/బిక్కవోలు/కొత్తపేట/కాకినాడ సిటీ: పవిత్ర రంజాన్ మాసం ముగిసింది. షవ్వాల్ నెల ప్రారంభ సూచికగా బుధవారం సాయంత్రం చంద్ర దర్శనంతో ముస్లింలు ఈద్ నమాజ్‌కు సిద్ధమయ్యారు. గురువారం ఈద్ ఉల్ ఫితర్ పండగ చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. నెల రోజుల పాటు కఠోర రోజాలు(ఉపవాసాలు) పాటిస్తూ, నమాజులు, సహర్, ఇఫ్తార్, ఖురాన్ పఠనం, దాన ధర్మాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో గడిపారు. ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలు దాటినా సడలని నిష్ఠతో దీక్ష కొనసాగించారు.

ఈద్ నమాజ్‌కు సిద్ధం

ఈద్ ఉల్ ఫితర్ నమాజ్ కోసం జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈద్గాలతో పాటు, మసీదుల్లో ప్రార్థనలకు అన్ని సౌకర్యాలు కల్పించారు. పండగ రోజు ముస్లింలు ఈద్గాలకు వెళ్లి ఈద్ ఉల్ ఫితర్ నమాజ్ చేస్తారు. నెల రోజుల తమ ప్రార్థనలు ఫలించాలని, సర్వమానవాళి సంతోషంగా ఉండాలని కోరుతూ దువా చేస్తారు.

జకాత్ 2.5 శాతం

రంజాన్ మాసంలో దానధర్మాలకు అధిక ప్రాధాన్యం ఉంది. ధనికులతో పాటు పేదలు సైతం పండగ ఆనందంగా చేసుకోవాలన్నదే ప్రధాన లక్ష్యం. మనిషి ఆరోగ్యం, తాను సంపాదించిన ధనంపై అల్లా సూచించిన బీమాయే జకాత్, ఫిత్రా దానాలు. 52.5 గ్రాముల వెండి, 75 గ్రాముల బంగారం, అంతకు మించి విలువైన ధనం/ఆస్తులు కలిగితే జకాత్ కచ్చితంగా ఇవ్వాల్సిందే. వాటికి వెల కట్టి, దానిలో 2.5 శాతం పేదలకు పంచాలి. ఈద్ ఉల్ ఫితర్ నమాజ్‌కు ముందే ఫిత్రా ఇచ్చేయాలి. రంజాన్‌లో జకాత్ ఇస్తే 70 రెట్లు అధికంగా పుణ్యం లభిస్తుందని ముస్లింల విశ్వాసం.

సర్వం సిద్ధం

ఈద్ ఉల్ ఫితర్ సందర్భంగా జిల్లాలో సామూహిక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సంప్రదాయం ప్రకారం ముస్లింలు ఖర్జూర పండు తిని, నూతన వస్త్రాలు ధరించి, అత్తరు రాసుకుని ప్రార్థనా స్థలానికి చేరుకుంటారు. అక్కడ సామూహిక ఈద్ నమాజ్ చదివి, అనంతరం పరస్పరం పండగ శుభాకాంక్షలు చెప్పుకొంటారు. ప్రార్థనా స్థలానికి అల్లా నామం స్మరిస్తూ ఒక మార్గం నుంచి వెళ్లి, వేరే మార్గం ద్వారా ఇంటికి చేరుకుని సేమియా పాయసం సేవిస్తారు. బంధుమిత్రులకు, ఇరుగుపొరుగు వారికీ సేమియా పంపిణీ చేసి, తమ ఆత్మీయతను తెలియజేస్తారు. చిన్న పిల్లలకు ఈద్ కానుకలు బహూకరిస్తారు. రాజమహేంద్రవరంలోని అన్ని మసీదుల్లో ఈద్ ఉల్ ఫితర్ ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.



విద్యుద్దీపాలతో కాంతులీనుతున్న రాజమహేంద్రవరంలోని మసీదు

ఫిత్రా రూ.130

రంజాన్ సందర్భంగా 1,750 గ్రాముల గోధుమలు, దానికి సమానమైన డబ్బు పేదలకు దానం చేయడమే ఫిత్రా. దీనిని ఆరోగ్య బీమాగా మత పెద్దలు చెబుతారు. పేదరికంతో పండగకు నోచుకోని అభాగ్యులకు ఫిత్రా దానం ఇవ్వాలి. సద్‌ఖా–ఎ–ఫిత్రాతో ఆరోగ్య బీమాను అల్లా కల్పిస్తారంటారు. ఈ ఏడాది మత పెద్దలు రూ.130 ఫిత్రాగా ఇవ్వాలని ఖరారు చేశారు. దీనికంటే ఎక్కువ ఇవ్వవచ్చు కానీ తగ్గించ కూడదు. పండగకు ఒకరోజు ముందే ఫిత్రా చెల్లిస్తే పేదలు సైతం పండగ చేసుకునే వీలుంటుంది. అప్పుడే పుట్టిన బిడ్డ మొదలు ఇంట్లో ఉన్న ప్రతి ఒక్కరి పేరున వేర్వేరుగా ఫిత్రాగా రూ.130 దానం చేయాలి.

పేదలకు చేతనైన సాయం



పండగ పూట ఏ ఒక్కరూ పస్తులు ఉండకూడదు. ఆకలి విలువ తెలియజేసేదే రంజాన్ ఉపవాస దీక్ష. ప్రతి ముస్లిం చుట్టుపక్కల ఉన్న పేదలకు చేతనైన సాయం చేయాలి. తనతో పాటు వారూ సంతోషంగా పండగ చేసుకునేలా దానధర్మాలు చేయాలి.

– మౌలానా షేక్ గులాం గౌస్ రిజ్వీ, జామియా మసీదు, పందలపాక

ప్రతి ఒక్కరూ అనుసరించాలి



పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు, ప్రత్యేక ప్రార్థనలతో జన్మధన్యమవుతుంది. రంజాన్ పర్వదినం ముస్లింలకు ఎంతో ప్రధానమైనది. గడచిన మాసంలో చేసిన ఉపవాస దీక్షలు, నమాజులు, దానాలు సంకల్పసిద్ధిని చేకూర్చుతాయి. అల్లా దివ్య సందేశాలను ప్రతి ఒక్కరూ అనుసరించి ఆచరించాలి.

– షేక్ అబ్దుల్ ఖాదర్, జిల్లా చైర్మన్, వక్ఫ్ బోర్డు, అమలాపురం

సత్ప్రవర్తనకు మార్గదర్శకం



రంజాన్ మాసంలో అనుసరించిన నియమ నిష్ఠలు, ప్రత్యేక ప్రార్థనలు మానవాళి సత్ప్రవర్తనకు మార్గదర్శకంగా దోహదపడతాయి. దివ్య ఖురాన్ పఠనం వల్ల ప్రజలందరూ ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలతో జీవిస్తారు. కుల, మత, వర్గ రహితంగా సమాజంలో స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుంది.

– షేక్ గౌస్, మండల ముస్లిం సంఘ నాయకుడు, కొత్తపేట



పందలపాకలో మసీదు



కాకినాడ మెయిన్‌రోడ్డులోని మసీదు

మే 18 నుంచి సత్యదేవుని కల్యాణ మహోత్సవాలు

- 19న స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణం
- ఏర్పాట్లపై అధికారులతో చర్చించిన ఈవో రామచంద్రమోహన్

అన్నవరం: రత్నగిరిపై కొలువైన వీర వేంకట సత్యనారాయణస్వామి, అనంతలక్ష్మి, సత్యవతీదేవి అమ్మవార్ల దివ్య కల్యాణ మహోత్సవాలు మే 18 నుంచి 24వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మే 19వ తేదీ రాత్రి 9.30 గంటల నుంచి స్వామివారి దివ్య కల్యాణం జరుగుతుంది. ఈ ఉత్సవాల కోసం విస్తృతంగా ఏర్పాట్లు చేయాలని దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం దేవస్థానం పండితులు, ఇతర అధికారులతో సమావేశమై కల్యాణ మహోత్సవాల ఏర్పాట్లపై చర్చించారు. వివిధ విభాగాల వారీగా చేయాల్సిన పనులపై దిశానిర్దేశం చేశారు. స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని రామాలయం వద్ద గల వార్షిక కల్యాణ మంటపంలో నిర్వహించాలని తీర్మానించారు. అలాగే ఉత్సవాలలో చివరి రోజు మే 24న జరిగే శ్రీపుష్పయాగాన్ని స్వామివారి ఆలయానికి ఈశాన్య భాగంలో గల నిత్య కల్యాణ మండపంలో చేయాలని నిర్ణయించారు. గతేడాది శ్రీపుష్పయాగం కార్యక్రమాన్ని వార్షిక కల్యాణ మండపంలో నిర్వహించడాన్ని వేద పండితులు తప్పు పట్టడంతో వివాదాస్పదమైంది. ఈ ఏడాది మాత్రం ఎప్పటిలాగానే శ్రీపుష్పయాగాన్ని నిత్యకల్యాణ మండపంలో నిర్వహించనున్నట్టు ఈఓ రామచంద్ర మోహన్ తెలిపారు. సమావేశంలో డిప్యూటీ ఈఓ రమేష్ బాబు, అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథరాజు, వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, గంగాధరభట్ల గంగబాబు, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ, కల్యాణ బ్రహ్మ ఛామర్తి కన్నబాబు, ఈఈ నరసింహారెడ్డి, ఏఈఓలు కృష్ణారావు, జగ్గారావు, భ్రమరాంబ, ఎల్.శ్రీనివాస్, సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ మహోత్సవాలపై అధికారులతో చర్చిస్తున్న ఈఓ రామచంద్రమోహన్

విందులకు వెళితే ఇబ్బందులే..

- అమలులో ఎన్నికల కోడ్
- ప్రభుత్వం ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి

కాకినాడ సిటీ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల నియమావళి (ఎన్నికల కోడ్) అమలులో ఉంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలి. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. ఈ సమయంలో పోటీలో ఉన్న అభ్యర్థులను కలవడం, వారు ఏర్పాటు చేసిన విందులకు హాజరవ్వడం వంటికి కోడ్ ఉల్లంఘన కిందకు వస్తాయి. అలాంటి వారిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇటీవల నియమావళి ఉల్లంఘనపై అనేక మంది ఉద్యోగులను బదిలీ చేయడం, కొందరిపై చర్యలు తీసుకోవడం జరిగింది.

ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు

ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రజలకు కలుస్తూ, ప్రచారం చేయడంతో పాటు ఓటర్లకు దగ్గరయ్యేందుకు సమావేశాలు, విందులు ఏర్పాటు చేస్తుంటారు. గతంలో అలాంటి విందులకు ఉద్యోగులు వెళ్లినా బయటకు తెలిసేది కాదు. కానీ ఇప్పటి తరం రాజకీయ నాయకులు ప్రత్యర్థి శిబిరంలో ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. ఇదే సమయంలో అందరి చేతుల్లో స్మార్ట్ ఫోన్‌లు ఉండడంతో ఎవరో ఒకరు ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తున్నారు. వాటిని ప్రత్యర్థులు పరిశీలించి, ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించిన అంశాలుంటే వెంటనే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆ సమావేశాలు, విందులకు వెళితే అనవసరంగా ఇబ్బందుల్లో పడతారు.

నిబంధనలు పాటించాలి

ప్రతి ఉద్యోగి ఎన్నికల నిబంధనలు పాటించాల్సిందే. ప్రభుత్వ వేతనం పొందుతున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఎన్నికల నిబంధన ప్రకారం ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా గానీ, వ్యతిరేకంగా గానీ ప్రచారం చేయరాదు. ఆయా రాజకీయ పార్టీల సభలకు హాజరు కాకూడదు. అభ్యర్థులు, వారి ప్రతినిధులు ఏర్పాటు చేసే విందులలో పాల్గొనకూడదు. దగ్గరి బంధువు పోటీ చేస్తున్నా, కుటుంబ సభ్యులలో ఉన్నా, దోస్తులు పోటీ చేస్తున్నా సరే ఉద్యోగులు రాజకీయ కార్యకలాపాలకు దూరంగా ఉండాల్సిందే. నిబంధనలు ఉల్లంఘిస్తే అనవసరం ఇబ్బందుల్లో పడాల్సి వస్తుంది.

అలరిస్తున్న ఉగాది ఆహ్వాన నాటికలు



చీకటి పువ్వు నాటికలో ఓ సన్నివేశం



నాటికలను వీక్షిస్తున్న సినీ నటుడు తనికెళ్ల భరణి, డైరెక్టర్ వంశీ, విక్టరీ వెంకటరెడ్డి

రావులపాలెం: ఉగాదిని పురస్కరించుకుని రావులపాలెంలోని కాస్మోపాలిటన్ రిక్రియేషన్ క్లబ్ (సీఆర్‌సీ) కాటన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో సీఆర్‌సీ కళావేదికలో నిర్వహిస్తున్న 24వ ఉగాది ఆహ్వాన నాటికల పోటీలు విశేషంగా అలరిస్తున్నాయి. రెండో రోజు పోటీలను తిలకించేందుకు పరిషత్ గౌరవ అధ్యక్షుడు, సినీనటుడు తనికెళ్ల భరణి, సినీ దర్శకుడు వంశీ, నటుడు కోట శంకరరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కాగా.. బుధవారం మూడు నాటికలు ప్రదర్శించారు. కరీంనగర్ చైతన్య కళాభారతి వారి చీకటి పువ్వు నాటికను దర్శకుడు రమేష్ మంచాల, పి.శివరాం (నాటకీరణ), ఎస్.నాగరాజు (సంగీతం), కె.నాగులు (రంగాలంకరణ) ప్రదర్శించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంది. హైదరాబాద్ సిరిమువ్వ కల్చరల్స్ వారి థింక్ నాటికను దర్శకుడు, రచయిత మంజునాథ్, నాగరాజు (సంగీతం), ఎం.గోపాలకృష్ణ (ఆహార్యం) సందేశాత్మకంగా ప్రదర్శించారు. హైదరాబాద్ మల్లాది క్రియేషన్స్ వారి సీకట్లో సెంద్రుడు నాటికను దర్శకుడు మురళీధర్, రచన మల్లాది రవి కిరణ్, సురభి నాగరాజు (సంగీతం), బీవీ రావు (ఆహార్యం) హాస్యభరితంగా ప్రదర్శించారు. ఏర్పాట్లను సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగమోహనరెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్ రెడ్డి, సీఆర్‌సీ రూపశిల్పి విక్టరీ వెంకటరెడ్డి, నాటక కళాపరిషత్ డైరెక్టర్ కె.సూర్య, పరిషత్ పర్యవేక్షణ డైరెక్టర్ పలివెల త్రిమూర్తులు, డైరెక్టర్లు సీహెచ్ గోపాలకృష్ణ, కొవ్వూరి నరేష్‌కుమార్‌రెడ్డి, పడాల సత్యనారాయణరెడ్డి, మల్లిడి ఆంజనేయరెడ్డి, చిర్ల కనికిరెడ్డి, నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి పర్యవేక్షించారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

అమలాపురం టౌన్: ఎన్నికల నేపథ్యంలో పోలీసు శాఖ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎస్ఈబీ బృందాలు జిల్లా వ్యాప్తంగా అక్రమ రవాణాను అడ్డుకుంటూనే అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతున్నాయి. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ బృందాలు జిల్లాలో జల్లెడ పడుతున్నాయి. చెక్ పోస్టులు, ఇతర ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించిన దాడులు, తనిఖీల్లో మొత్తం 25 మంది నిందితులను అరెస్ట్ చేశాయి. రూ.2.12 లక్షల నగదు, ఎన్‌డీపీ, ఐఎంఎల్, డ్యూటీ పెయిడ్ మద్యం, సారా స్వాధీనం చేసుకున్నాయి. కోడి పందేలు, పేకాటలపై కూడా దాడులు చేశారు. ఈ దాడులు, తనిఖీలు, అరెస్టులు, నగదు, మద్యం స్వాధీనం వంటి వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం బుధవారం రాత్రి విడుదల చేసిన ఓ ప్రకటనలో వివరించింది.

- ఉప్పలగుప్తం, ఐ.పోలవరం పోలీసు స్టేషన్ల పరిధిలో ముగ్గురిని అరెస్ట్ చేసి, వారి నుంచి మూడు ఎన్‌డీపీ మద్యం సీసాలు, 4.67 లీటర్ల ఐఎంఎల్ మద్యం, 19 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.
- అమలాపురం తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసి, వారి వద్ద రూ.500 సీజ్ చేశారు.
- ముమ్మిడివరం పోలీస్ స్టేషన్ పరిధిలో కోడి పందేలు ఆడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.2,400, కోడి పుంజు, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు.
- ఆత్రేయపురం పోలీసు స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి, 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.
- రావులపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.1,550 స్వాధీనం చేసుకున్నారు.
- మలికిపురం, సఖినేటిపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో కోడి పందేలు ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద రూ.7,160, నాలుగు కోడి పుంజులు, నాలుగు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు.



ద్రాక్షారామలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

- అంగర పోలీసు స్టేషన్ పరిధిలో కోడి పందేలు ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.4,500 నగదు, రెండు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నారు.
- అమలాపురం, ముమ్మిడివరం, ఆలమూరు, రామచంద్రపురం, రాజోలు, కొత్తపేట పోలీసు స్టేషన్ల పరిధిలో ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. ఆరు ఎన్‌డీపీ మద్యం సీసాలు, 14.55 లీటర్ల ఐఎంఎల్, 61 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, ఒక మోటారు సైకిల్ సీజ్ చేశారు.
- రామచంద్రపురం, సఖినేటిపల్లి పోలీసు స్టేషన్ల పరిధిలో వాహనాలను తనిఖీ చేసి రూ.1,96,310 సీజ్ చేశారు.
- జొన్నాడ, గోపాలపురం, బొబ్బర్లంక, దిండి, ఎదుర్లంక, నరసాపురపుపేట చెక్ పోస్టుల్లో వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు.
- సమస్యాత్మక గ్రామాలైన మలికిపురం మండలం ఇరుసుమండ, ద్రాక్షారామ, భీమక్రోసుపాలెం, తోటపేట గ్రామాల్లో ఆయా ప్రాంతాల పోలీసు అధికారులతో కలిసి కేంద్ర బలగాలు బుధవారం కవాతు నిర్వహించాయి. వచ్చే ఎన్నికల్లో ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేయాలని పోలీసు అధికారులు ఆయా గ్రామాల ప్రజలకు భరోసా ఇచ్చారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురానికి చెందిన పసలపూడి రామకృష్ణను కొట్టి, కులం పేరుతో దూషించిన కారణంగా ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామని ఎస్సై టి.రామకృష్ణ బుధవారం తెలిపారు. గ్రామంలోని వడ్డీరపేటకు చెందిన అరవింద్, ఈశ్వర్‌తో పాటు మరో ముగ్గురు యువకులు కులం పేరుతో రామకృష్ణను దూషిస్తూ, రాయితో తలపై కొట్టారు. గాయపడిన రామకృష్ణ రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి సమాచారం మేరకు పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. నార్త్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు దర్యాప్తు చేయనున్నారు.

దాడి ఘటనపై..

రఘుదేవపురానికి చెందిన పసలపూడి రామకృష్ణ మంగళవారం వేరే వ్యక్తులతో గొడవ పడుతుంటే వడ్డీరపేటకు చెందిన దోమ సత్యనారాయణ సర్దిచెప్పబోయాడు. దీంతో సత్యనారాయణ తలపై రామకృష్ణ బ్రాందీ సీసాతో దాడి చేశాడు. దీనిపై సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

బాలికకు తీవ్ర గాయాలు

గోకవరం: మండలంలోని బావాజీపేట శివారున ఉన్న పోలవరం వంతెనపై జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 ఏళ్ల బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. పలువురు స్వల్పంగా గాయపడ్డారు. వంతెనపై బుధవారం సాయంత్రం మూడు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలికను స్థానికులు హుటాహుటిన గోకవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన తర్వాత మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. రోడ్డు ప్రమాదంలో మరో బాలుడితో పాటు ఇంకొందరు గాయపడ్డారు. ఈ ఘటనతో వంతెనపై ట్రాఫిక్ స్తంభించింది. పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలిక

చికిత్స పొందుతూ మత్స్యకారుడి మృతి

విశాఖపట్నం: సముద్రంలో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయాలపాలై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఓ మత్స్యకారుడు బుధవారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. గత నెల 26న కాకినాడ నుంచి ట్యూనా చేపల వేట కోసం ఐఎన్‌డీ ఏపీ 47 బోటు వెళ్లింది. ఈ నెల 5న విశాఖకు 20 నాటికల్ మైళ్ల దూరంలో బోటులో అగ్ని ప్రమాదం జరిగింది. జనరేటర్ పేలి మంటలు చెలరేగాయి. ఈ మంటలు క్షణాల్లో వ్యాప్తి చెందాయి. ఆ సమయంలో బోటులో ఉన్న తొమ్మిది మంది మత్స్యకారులు గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఏపీ మర పడవల సంఘం ఆధ్వర్యంలో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ విజయకృష్ణ కోస్టుగార్డ్ నౌకలను అప్రమత్తం చేశారు. కోస్టుగార్డ్ నౌక ఐసీజీఎస్ వీరాలో గాయపడ్డ వీరిని ఒడ్డుకు తీసుకువచ్చి, ముందు నేవల్ డాక్‌యార్డ్‌లో ప్రథమ చికిత్స చేశారు. అనంతరం కేజీహెచ్‌కు తీసుకొచ్చి బర్న్స్ వార్డులో చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతున్న వారిలో ఆర్.సత్తిబాబు (40) ఆరోగ్యం మంగళవారం రాత్రి నుంచి క్షీణించింది. 81 శాతం మేర కాలిపోయిన ఆయన బుధవారం ఉదయం ప్రాణాలు విడిచినట్లు వైద్యులు ప్రకటించారు. ఐసీయూలో మరో ఇద్దరు, వార్డులో ఆరుగులు చికిత్స పొందుతున్నట్లు కేజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి మోహనరావు తెలిపారు.

లవ్‌మౌళి చిత్రయూనిట్ సందడి

కాకినాడ రూరల్: లవ్ మౌళి సినిమా ప్రమోషన్‌లో భాగంగా హీరో నవదీప్, హీరోయిన్లు పంకూరి గిద్వాణీ, భావన సాగీ తదితరులు బుధవారం సినీ దర్శకుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సోదరుడు కల్యాణ్ కృష్ణను కలిశారు. రమణయ్యపేటలోని కన్నబాబు క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన వీరు.. కల్యాణ్ కృష్ణతో కొద్దిసేపు ముచ్చటించారు. సినిమా విజయవంతానికి సహకారం అందించాలని హీరో నవదీప్ కోరారు. కన్నబాబు నివాసం వద్ద గోశాలలో మేక పిల్లను ఎత్తుకుని కొద్దిసేపు నవదీప్ సందడి చేశారు.



సినిమా కటౌట్ వద్ద హీరో నవదీప్, హీరోయిన్లు పంకూరి గిద్వాణీ, భావన సాగీ

సైగలకు మాటలొచ్చాయి



న్యాయవాది అడ్వా సారా సన్నీ భారతదేశపు మొట్టమొదటి వినికిడి లోపం గల రిజిస్టర్డ్ ప్రాక్టీసింగ్ లాయర్‌గా చరిత్ర సృష్టించారు. ఏప్రిల్ 4న ఆమెకు సహాయం చేయడానికి సమాచార, సాంకేతిక మంత్రిత్వ శాఖ ద్వారా సర్టిఫైడ్ ఇంటర్ ప్రెటర్ సేవలను పొందాలని కోర్టు తన రిజిస్ట్రీని ఆదేశించింది. ఫలితంగా ఏప్రిల్ 8న కర్ణాటక హైకోర్ట్ రిజిస్ట్రర్ సంజ్ఞా భాషా వ్యాఖ్యాత ద్వారా వినికిడి లోపం ఉన్న న్యాయవాది నుంచి వాదనలు విన్నది. దీంతో అడ్వకేట్ సారా సన్నీతోపాటు కర్ణాటక హైకోర్ట్ కూడా దివ్యాంగులకు ఒక గొప్ప బాసటగా నిలిచినట్లయింది. ఇది న్యాయ నిపుణులకు మాత్రమే కాకుండా వినికిడి లోపం ఉన్న పౌరులకు కూడా సమగ్ర న్యాయవ్యవస్థకు మార్గం మరింతగా సుగమం చేస్తుంది.

జస్టిస్ ఎం నాగప్రసన్న, అదనపు సొలిసిటర్ జనరల్ అరవింద్ కామత్‌లతో కూడిన సింగిల్ జడ్జి బెంచ్ అడ్వా సన్నీ నమోదును ప్రశంసించింది. ఏఎస్‌జీ కామత్ మాట్లాడుతూ 'ఇంటర్‌ప్రెటర్ ద్వారా హియరింగ్, స్పీచ్ ఇంపెయిర్‌డ్ అడ్వకేట్ వాదనను విన్న మొదటి హైకోర్టుగా కర్ణాటక హైకోర్టు చరిత్రలో నిలిచిపోతుంది. సారా సన్నీ సంకేత భాషా వ్యాఖ్యాత ద్వారా వినికిడిలోపం, ప్రసంగం బలహీనంగా ఉండటం వల్ల కలిగే వైకల్యాన్ని ఓడించింది. అందుకు సారా సన్నీని అభినందించాల్సిందే. సంజ్ఞా భాషా వ్యాఖ్యాత ద్వారా వాదప్రతివాదనలు జరిగినప్పటికీ ప్రశంసలు రికార్డులలో నమోదు అవుతాయి' అని తెలియజేశారు. భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ 'భారత న్యాయవ్యవస్థలో వివిధ నేపథ్యాల నుండి ఎక్కువ మంది మహిళలు చేరాల'ని పదే పదే ప్రస్తావించారు.

ప్రోత్సహించడానికి... అడ్వా సారా సన్నీ కేరళలోని కొట్టాయం వాసి. బెంగళూరులోని సెయింట్ జోసెఫ్ విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీ పట్టా అందుకున్నారు. కేవలం స్వీయ ఆసక్తితో మాత్రమే కాకుండా వినికిడి లోపం ఉన్న ఇతరులను కూడా ప్రోత్సహించడానికి న్యాయవాద వృత్తిని ఎంచుకుంది. అడ్వకేట్ సన్నీ ఇప్పుడు నేషనల్ అసోసియేషన్ ఆఫ్ డెఫ్ అండ్ హ్యూమన్ రైట్స్ లా నెట్‌వర్క్‌లో యాక్టివ్ మెంబర్. సెప్టెంబరు 2023లో న్యాయవాది సన్నీ భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఒక కేసు వాదించిన, వినికిడి లోపం ఉన్న మొట్ట మొదటి లాయర్‌గా చరిత్ర సృష్టించింది. ఈ సందర్భంలో సన్నీ 'డీవై చంద్రచూడ్ ఓపెన్ మైండ్ ప్రత్యేక సామర్థ్యం ఉన్న వ్యక్తుల కోసం తలుపులు తెరిచింది' అని తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

సన్నీ కోర్టు సబిమిషన్స్‌లో సహాయం చేయడానికి సంకేత భాషా ఇంటర్‌ప్రెటర్‌ను ఏర్పాటు చేయాలని కోర్టు గతంలో తన రిజిస్ట్రీని, కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇప్పుడు అది అమలు అయ్యింది. వైకల్యాలున్నవారు తమ అడ్డంకులను అధిగమించడంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయి అయ్యింది.



అల్లాహు
అక్బర్ ..
అల్లాహు అక్బర్ ..
లాయిలాహ ఇల్లల్లాహు
వల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హంద్ ..!

సమతా మమతల పర్వం ఈదుల్ ఫిత్ర్!

నేడు రమజాన్

ఈ రోజు ఎటువిన్నా ఈ స్తోత్ర గానమే, ఆ దయామయుని కీర్తిగానమే వినిపిస్తూ హృదయాలను పులకింపజేస్తూ ఉంటుంది. ఊరు, వాడ, పల్లె, పట్నం, చిన్నా పెద్దా, ఆడా మగా, ముసలీ ముతకా అనే తేడా లేకుండా ఎవరి నోట విన్నా ఈ అమృత వచనాలే జాలువారుతూ ఉంటాయి.

కొత్తబట్టలు, కొత్తహంగులు, తెల్లని టోపీలు మల్లెపూలలా మెరిసిపోతుంటాయి. అత్తరు పన్నీరు పరిమళాలు, అస్సలాము అలైకుం, ఈద్ ముబారక్‌లు, చిరునవ్వుల కరచాలనాలు, ఆలింగనాల ఆనంద తరంగాలు, అలయ్ బలయ్‌లతో విశ్వాసుల హృదయాలు సంతోషసాగరంలో ఓలలాడుతూ ఉంటాయి.

సేమ్యాలు, షీర్ ఖుర్మాలు, బగారా, బిర్యానీల ఘుమఘుమలతో, ఉల్లాస పరవళ్ళ హడావిడితో ముస్లిముల లోగిళ్ళు కిలకిలనవ్వుతూ, కళకళలాడుతూ ఉంటాయి. ఇళ్ళలో ఆడాళ్ళ హడావిడికి, పిల్లల సందడికి హద్దులే ఉండవు. ఎందుకంటే ఇది ఒక్కనాటి పండుగ కాదుగదా! నెల్లాళ్ళపాటు భక్తిప్రపత్తులతో జరుపుకున్న పండుగకు అల్విదా చెబుతున్న ముగింపు ఉత్సవం.

రమజాన్ నెలరోజులూ ముస్లింల వీధులు 'సహెరీ','ఇఫ్తార్' ల సందడితో నిత్యనూతనంగా కొత్తశోభతో అలరారుతుంటాయి. మసీదులన్నీ భక్తులతో కిటకిటలాడుతూ, ప్రేమామృతాన్ని చిలకరిస్తూ వింత అనుభూతుల్ని పంచుతుంటాయి. భక్తులు పవిత్ర గ్రంథ పారాయణా మధురిమను గ్రోలుతూ వినూత్న అనుభూతులతో పరవశించి పోతుంటారు. అవును.., ఇలాంటి అనుభూతులు, ఆనందాలు, ఆహ్లాదాలు, అనుభవాలు, అనుభూతుల సమ్మేళనమే పండుగ. ఇలాంటి ఓ అద్భుతమైన, అపురూప సందర్భమే 'ఈదుల్ ఫిత్ర్ '. దీన్నే రమజాన్ పండుగ అంటారు. ముస్లిం సమాజం జరుపుకునే రెండు ముఖ్యమైన పండుగల్లో ఇది మొదటిదీ, అతి పవిత్రమైనదీను. ఈ నెలలో ముస్లింలు అత్యంత నియమనిష్టలతో రోజా వ్రతం పాటిస్తారు. భక్తిశ్రద్ధలతో రోజూ ఐదుసార్లు నమాజ్ చేస్తారు. పవిత్ర ఖురాన్ గ్రంథాన్ని భక్తితో పారాయణం చేస్తూ, దాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. ముహమ్మద్ ప్రవక్త(స)వారిపై సలాములు పంపుతూ ఉంటారు. దైవనామస్మరణలో అనునిత్యం వారి నాలుకలు నర్తిస్తూ ఉంటాయి. ప్రతిరోజూ తరావీహ్ నమాజులో పాల్గొని తన్మయులవుతుంటారు. దానధర్మాలు చేస్తారు, ఫిత్రాలు చెల్లిస్తారు. ఈ విధంగా రమజాన్ చంద్రవంక దర్శనంతో ప్రారంభమైన ఉపవాసదీక్షలు నెలరోజుల తరువాత షవ్వాల్ మాసం నెలవంక దర్శనంతో సమాప్తమవుతాయి. షవ్వాల్ మొదటితేదీన జరుపుకునే 'ఈదుల్ ఫిత్ర్' పర్వదినాన్నే మనం రమజాన్ పండుగ అంటున్నాము. ఈ పండుగ సంబంధం రమజాన్ నెలతో ముడివడి ఉన్న కారణంగా ఇది రమజాన్ పండుగగా ప్రసిద్ధి చెందింది. రమజాన్ ఉపవాస దీక్షలు, పవిత్ర ఖురాన్ అవతరణతో దీని సంబంధం పెనవేసుకు పోయి ఉంది.

మానవుల్లో దైవభక్తిని, దైవభీతిని, సదాచారాన్ని, మానవీయ విలువల్ని జనింపజేయడానికి సృష్టికర్త ఉపవాస వ్రతాన్ని విధిగా నిర్ణయించాడు. దైవాదేశ పాలనకు మనిషిని బద్ధునిగా చేయడమే ఉపవాస దీక్షల అసలు లక్ష్యం. ఒక నిర్ణీత సమయానికి మేల్కొనడం, సూర్యోదయం కాకముందే భుజించడం(సహెరి), సూర్యాస్తమయం వరకూ పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టకుండా, రోజూ ఐదుసార్లు దైవారాధనచేస్తూ సూర్యాస్తమయం తరువాత రోజా విరమించడం(ఇఫ్తార్), మితాహారం తీసుకోవడం, మళ్ళీ అదనపు ఆరాధనలు అంటే తరావీహ్ నమాజులు చేయడం, మళ్ళీ తెల్లవారు ఝామున లేవడం – ఈవిధంగా రమజాన్ ఉపవాస వ్రతం మనిషిని ఒక క్రమశిక్షణాయుతమైన, బాధ్యతాయుతమైన, దైవభక్తి పరాయణతతో కూడుకున్న జీవనవిధానానికి అలవాటు చేస్తుంది. మానవుల్లో ఇంతటి మహోన్నత విలువలను, సుగుణాలను జనింపజేసే వ్రతాన్ని పరాత్పరుడైన అల్లాహ్ వారికి అనుగ్రహించినందుకు, వాటిని వారు నెలరోజులూ త్రికరణ శుద్ధిగా పాటించ గలిగినందుకు సంతోష సంబరాల్లో తేలిపోతూ కృతజ్ఞతాపూర్వకంగా భక్తి శ్రద్ధలతో పండుగ జరుపుకుంటారు.

మరో ముఖ్య విషయం ఏమిటంటే, పవిత్ర రమజాన్ నెలలోనే సమస్త మానవాళి సన్మార్గ దీపిక అయిన మహత్తర గ్రంథరాజం ఖురాన్‌ను దేవుడు మానవాళికి ప్రసాదించాడు. సమస్త మానవజాతికీ మార్గదర్శక జ్యోతి పవిత్ర ఖురాన్. సన్మార్గం చూపే, సత్యాసత్యాలను వేరుపరిచే స్పష్టమైన ఉపదేశాలు ఇందులో ఉన్నాయి. ఈ గ్రంథరాజం మానవులందరికీ సన్మార్గ బోధన చెయ్యడానికి అవతరించిన ప్రబోధనా జ్యోతి.

దైవ ప్రసన్నతను చూరగొనడానికి రోజా పాటించడం,'తరావీహ్ 'లు ఆచరించడం, దానధర్మాలు చేయడంతో పాటు, ఈ నెల చివరిలో'లైలతుల్ ఖద్ర్' అన్వేషణలో అధికంగా ఆరాధనలు చేస్తారు. లైలతుల్ ఖద్ర్ అంటే అత్యంత అమూల్యమైన రాత్రి అని అర్థం.

ఉపవాసం పాటించడంవల్ల పేదవాళ్ళ ఆకలి బాధలు అర్థమవుతాయన్నారు. సంపన్నులకు, ముప్పూటలా సుష్టుగా తినేవారికి నిరుపేదల ఆకలికేకలు వినబడవు. అలాంటివారు గనక ఉపవాసం పాటించినట్లయితే ఆకలి బాధ ఎలా ఉంటుందో వారికీ తెలుస్తుంది. తద్వారా పేదసాదలను ఆదుకోవడం, వారికి పట్టెడన్నం పెట్టడం ఎంతగొప్ప పుణ్యకార్యమో వారు అనుభవపూర్వకంగా తెలుసుకోగలుగుతారు. ఈ విధంగా రమజాన్ నెల ఆరంభంనుండి అంతం వరకు ఒక క్రమపద్ధతిలో ధర్మం చూపిన బాటలో నడుస్తూ, దైవప్రసన్నత, పుణ్యఫలాపేక్షతో ఈనెలను గడిపినవారు ధన్యులు. నిజానికి ఇలాంటివారే పండుగ శుభకామనలకు అర్హులు. అందుకే 'ఈద్ '(పండుగ)ను శ్రామికుని వేతనం(ప్రతిఫలం)లభించే రోజు అని చెప్పడం జరిగింది. ఈ విధంగా రమజాన్ పర్వదినం మనిషిని ఒక ఉన్నతమానవీయ విలువలుకలవాడుగా తీర్చిదిద్ది, సమాజంలో శాంతి, సమానత్వం, సామరస్యం, సోదర భావాలకు పునాదివేస్తుంది. ప్రేమ తత్వాన్ని ప్రోదిచేస్తుంది. ఇదే ఈదుల్ ఫిత్ర్ – రమజాన్ పర్వదిన పరమార్థం.

ఈ కాలంలోనే ఆర్థికంగా కలిగిన వాళ్ళు తమ ధనంలోని ఒక నిర్ణీతభాగాన్ని పేదసాదలకు దానం చేస్తారు. 'జకాత్' నిజానికి దానంకాదు. పేదవారి హక్కు. తమ నిల్వ ఆదాయంలోంచి నూటికి రెండున్నర శాతం తీసి దానం చేస్తారు. అలాగే ఫిత్రాలు కూడా! ఇది ఆర్థిక స్థోమతతో సంబంధం లేకుండా కాస్తో కూస్తో కలిగిన వారందరూ చెల్లించాలి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పండుగ జరుపుకునే స్థోమతలేని వారికి ఫిత్రా దానం వల్ల గొప్ప ఊరట లభిస్తుంది. దీనివల్ల పేదసాదలు కూడా కొత్త బట్టలో, పండుగ సామగ్రో కొనుక్కోగలుగుతారు. ముస్లిములు, ముస్లిమేతరులు అన్న భేద భావం లేకుండా సమాజంలోని పేద సాదలపట్ల సంపన్నులు తమ బాధ్యతను గుర్తెరిగి మసలుకోవలసిన అవసరాన్ని రమజాన్ గుర్తుచేస్తుంది. అనవసర భోగవిలాసాలకు తమ ధనం వృథా చేయకుండా అగత్యపరులను ఆదుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెబుతుంది. అందుకే ప్రవక్త వారు రమజాన్‌ను 'సానుభూతుల నెల' అన్నారు.

సదాచరణల సంపూర్ణప్రతిఫలం లభించిన సంతోషంలో అంబరాన్నంటేలా సంబురాలు జరుపుకొని ఆనంద తరంగాల్లో తేలియాడే రోజు ఈదుల్ ఫిత్ర్ . – ఆరోజు ముస్లిములందరూ ఈద్ నమాజ్ ముగించుకొని పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుంటారు. పండుగకు ప్రత్యేకంగా తయారు చేసిన సేమియా పాయసాన్ని తమ హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిఖ్ఖు సోదరులందరికీ ఆప్యాయంగా రుచి చూపించి తమ ఆనందాన్ని వారితో పంచుకుంటారు.'ఈద్ ముబారక్' అంటూ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆత్మీయంగా ఆలింగనాలు చేసుకుంటారు.

పవిత్ర ఖురాన్ రూపంలో అవతరించిన సృష్టికర్త మహదనుగ్రహం దానవుడి లాంటి మానవుణ్ణి దైవదూతగా మలిచింది. అజ్ఞానం అంధకారాల కారు చీకట్ల నుండి వెలికి తీసి, విజ్ఞానపు వెలుగుబాటకు తీసుకు వచ్చింది. నైచ్యపు అగాథాలనుండి పైకిలాగి పవిత్రతా శిఖరాలపై నిలిపింది. మానవుల్లోని పశుప్రవృత్తిని మానవీయ పరిమళంతో పారద్రోలింది. ఆటవికతను నాగరికతతో, అజ్ఞాన తిమిరాన్ని జ్ఞానదీపికతో, అవివేకాన్ని వివేకంతో పారద్రోలి మనుషుల్ని మానవోత్తములుగా సర్వతోముఖంగా తీర్చిదిద్దింది. మానవాళికి ఇంతటి మహదానుగ్రహాలు ప్రసాదించి, వారి ఇహపరలోకాల సఫలతకు పూబాటలు పరిచిన నిఖిల జగన్నాయకునికి కృతజ్ఞతాభివందనాలు చెల్లించుకోవడమే ఈ పండుగ ఉద్దేశ్యం.

ఈదుల్ ఫిత్ర్ పర్వదిన శుభాకాంక్షలు

– మదీహా అర్జుమంద్

ఘనత



**కింద గాఢంగా పారే చీనాబ్ నది.
పైన 359 మీటర్ల ఎత్తులో రైలు బ్రిడ్జి.
కశ్మీర్ లోయలో ఉధమ్‌పూర్ నుంచి బారాముల్లా వరకు వేయదలచిన భారీ రైలు మార్గంలో చీనాబ్‌ను దాటడం ఒక సవాలు.
దాని కోసం సాగిన ఆర్చ్ బ్రిడ్జి నిర్మాణంలో మన తెలుగు ఇంజినీర్ మాధవీ లత కృషి కీలకం.
'వరల్డ్ హైయ్యెస్ట్ రైల్వే బ్రిడ్జి' నిర్మాణంలో పాల్గొన్న మాధవీ లత పరిచయం.**

ఆమె నదిని దాటించింది



● మాధవీ లత

ఒక సుదీర్ఘకల నెరవేరబోతోంది. సుదీర్ఘ నిర్మాణం ఫలవంతం కాబోతూ ఉంది. దేశ అభివృద్ధిలో కీలకమైన రవాణా రంగంలో ఎన్ని ఘన నిర్మాణాలు సాగితే అంత ముందుకు పోతాము. అటువంటి ఘన నిర్మాణం జాతికి అందుబాటులో రానుంది. జమ్ము కశ్మీర్‌లో ప్రపంచంలోనే అతి ఎత్తయిన రైల్వేవంతెన ట్రయల్ రన్ పూర్తి చేసుకుని త్వరలోనే కార్యకలాపాలు నిర్వహించనుంది. అయితే ఈ క్లిష్టమైన నిర్మాణంలో తెలుగు మహిళా ఇంజినీర్ కీలకపాత్ర పోషించడం ఘనంగా చెప్పుకోవాల్సిన సంగతి. తెనాలికి చెందిన ప్రొఫెసర్ గాలి మాధవీలతదే ఈ ఘనత.

చీనాబ్ ఆర్చ్ బ్రిడ్జ్

భారతీయ రైల్వే 2004లో జమ్ము–కశ్మీర్‌లో భారీ రైలు ప్రాజెక్ట్‌కు అంకురార్పణ చేసింది. జమ్ము సమీపంలోని ఉధంపూర్ నుంచి శ్రీనగర్ సమీపంలోని బారాముల్లా వరకు రైలు మార్గం నిర్మించడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ఈ మార్గంలో రీసీ జిల్లా బాక్కల్ దగ్గర చీనాబ్ నదిపై వంతెన నిర్మించాల్సి వచ్చింది. ఇది చాలా క్లిష్టమైన నిర్మాణం. ఎందుకంటే ఇది ఐఫిల్ టవర్ కంటే 35 మీటర్ల ఎత్తు వంతెన అవుతుంది. అయినప్పటికీ మన ఇంజినీర్లు దశల వారీగా నిర్మాణం పూర్తి చేయగలిగారు. జూలైలో దీని కార్యకలాపాలు పూర్తిస్థాయిలో మొదలవుతాయి.

ప్రొఫెసర్‌గా పని చేస్తూ...

ప్రకాశం జిల్లా ఏడుగుండ్లపాడుకు చెందిన మాధవీలత కాకినాడలో ఇంజినీరింగ్ చేశారు. ఐ.ఐ.టి. మద్రాస్‌లో పీహెచ్‌డీ చేశారు. బెంగళూరులోని ఐ.ఐ.ఎస్.సి.లో 'రాక్ మెకానిక్స్'లో పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌ను కొనసాగించారు. బెంగళూరులో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న మాధవీలత అక్కడే సెంటర్ ఫర్ సస్టెయినబుల్ టెక్నాలజీస్ విభాగానికి చైర్‌పర్సన్‌గా కూడా ఉంటూ సైన్స్‌ను, టెక్నాలజీని గ్రామీణాభివృద్ధికి చేరువ చేసే ప్రాజెక్టులకు నాయకత్వం వహిస్తున్నారు. అయితే 'రాక్ మెకానిక్స్'లో మాధవీలతకు ఉన్న అనుభవమే ఆమెను చీనాబ్ వంతెన



నిర్మాణంలో పాల్గొనేలా చేసింది. చీనాబ్ వంతెన నిర్మాణానికి రూ.1400 కోట్లు వ్యయం చేస్తే 300 మంది సివిల్ ఇంజినీర్లు, 1300 మంది వర్కర్లు రేయింబవళ్లు పని చేశారు. బ్రిడ్జ్‌ను రెండు కొండల మధ్య నిర్మించాల్సి ఉన్నందున ఇంజినీరింగ్ డిజైన్ చాలా క్లిష్టంగా మారింది. అయినప్పటికీ అక్కడి రాళ్లను పరిశోధించి, అధ్యయనం చేసిన మాధవీలత, పటిష్టమైన వాలు స్థిరీకరణ ప్రణాళికను రూపొందించి, అమలును నిరంతరం పర్యవేక్షిస్తూ వచ్చారు. ఆమె విశ్లేషణ, సాంకేతిక సూచనలను దేశంతోపాటు విదేశాల్లోని పలువురు నిపుణులు తనిఖీ చేసి ఆమోదించడంతో వంతెన నిర్మాణం ముందుకు సాగింది. ఈ రైలు మార్గంలో నిర్మించిన కొన్ని సొరంగాల నిర్మాణంలోనూ మాధవీలత పాల్గొన్నారు.

అవకాశం ఇలా...

ఉధంపూర్ – బారాముల్లా కొత్త రైలుమార్గంలో చీనాబ్ నదిపై స్టీల్ ఆర్చ్ వంతెన నిర్మాణ బాధ్యతను కొంకణ్ రైల్వేస్ 'ఆఫ్కాన్స్' సంస్థకు ఇచ్చింది. ఆఫ్కాన్స్ సంస్థకు జియో టెక్నికల్ కన్సల్టెంటుగా ఉన్న మాధవీలతకు అలా ప్రాజెక్టులో పనిచేసే అవకాశం లభించింది. 'ప్రాజెక్టు నిర్మాణంలో అనేక సవాళ్లు ఎదురయ్యాయి. చీనాబ్ నదిపై రెండు ఎత్తయిన వాలు కొండలను కలుపుతూ సాగిన ఈ వంతెన నిర్మాణంలో వాలు స్థిరత్వం కీలకమైంది. రాక్ మెకానిక్స్ సాంకేతికత, స్థిరత్వ అంశాలను అర్థం చేసుకోవటం, కొండ వాలుల స్థిరత్వాన్ని పొందటానికి నేను పరిష్కారాలను అందించటంతో ఇప్పుడో ఇంజినీరింగ్ అద్భుతం సాక్షాత్కరించింది. జోన్–5 భూకంపాలను, గంటకు 266 కి.మీ వేగంతో వీచే గాలులను, తీవ్రమైన పేలుళ్లను తట్టుకునేలా ఈ వంతెన నిర్మితమైంది' అన్నారు మాధవీలత. 'నేల పటిష్టతపై ఐ.ఐ.టి మద్రాస్‌లో నా పీహెచ్‌డీ పరిశోధనల్లో భాగంగా పాలిమర్‌లను ఉపయోగించి పటిష్టమైన రోడ్ల నిర్మాణానికి వినూత్న సాంకేతిక విధానాన్ని రూపొందించాను. ఆ దిశగా మూడు దశాబ్దాలపాటు చేసిన పరిశోధనల ఫలితంగా నేడు భూకంప నిరోధక శక్తి కలిగిన నిర్మాణాల్లో పాలిమర్‌లని, రబ్బర్ టైర్ల వంటి వ్యర్థపదార్థాలని వినియోగించగలుగుతున్నాం' అన్నారు. చీనాబ్ వంతెన నిర్మాణానికి రేయింబవళ్లు శ్రమించిన మాధవీలత, ఈ ప్రాజెక్టు కోసం ఎన్నో వ్యక్తిగత త్యాగాలు చేయాల్సి వచ్చిందని చెప్పారు. తన కుటుంబ ప్రాధాన్యతలను పక్కనపెట్టి, సైట్‌ను సందర్శించిన సందర్భాలను గుర్తు చేసుకుంటూ, 'నా పిల్లల పరీక్షల సమయాల్లో కూడా వాళ్లను వదిలి వెళ్లాల్సి వచ్చేది. నా భర్త హరిప్రసాద్‌రెడ్డి, పిల్లలు అభిజ్ఞ, శౌర్యల సహనం, సహకారాలతో ఇది సాధ్యమైంది. చీనాబ్ వంతెన నా సొంత ప్రాజెక్టులా మారిపోయింది' అన్నారు.

– బి.ఎల్.నారాయణ, సాక్షి, తెనాలి

కంచికి వెళ్లిన కథను ఇంటికి తెద్దాం



● కథకారిణి గీతా రామానుజం

ఒకప్పుడు మనదేశంలో ప్రతి ఇల్లూ కథాకారులను తయారు చేసే గొప్ప సాంస్కృతిక వేదిక. కథాకారులు కనీసం ఇంటికొక్కరైనా ఉండేవారు. వీధిలో ఒకరిద్దరు నిష్ణాతులుండేవారు. ఆ నిష్ణాతులు కథ చెప్పడం మొదలు పెడితే చాలు, ఆ వీధిలోని అన్ని ఇళ్లలోని పిల్లలూ అక్కడే ఉండేవాళ్లు. శ్రోతలను కట్టిపడేసేటట్లు కథ చెప్పడానికి నియమిత శిక్షణ ఉండేది కాదు. వాళ్లు కథ చెప్పడంలో ఏ యూనివర్సిటీలోనూ కోర్సు చేయలేదు. అయినా సరే... కథ పూర్తయ్యేటప్పటికి హౌస్‌ఫుల్ అన్నట్లు ఆ ఇంటి వరండా నుంచి వీధి అరుగు వరకు జనంతో నిండిపోయేది. అలాంటి కథలు ఇప్పుడేమయ్యాయి?

మాయమవుతున్న కథాకారులు

గ్రామాలు కుచించుకుపోతున్నాయి, నగరాలు విస్తరిస్తున్నాయి. ప్రతి ఊరి నుంచి తరానికి కొందరు పట్టణాలకు వలసపోతున్నారు. పిల్లలకు కథలు చెప్పడానికి తగినంత ఖాళీ సమయం ఉన్న పెద్దవాళ్లు గ్రామాల్లో ఉండిపోవడం, పిల్లలు తల్లిదండ్రులతో నగరాలకు తరలి వెళ్లడంతో తరాలను కలిపి ఉంచిన కథ అనే అందమైన బంధం కూడా తెగిపోయింది. నగరాల్లో పిల్లలకు కథ చెప్పే బాధ్యతను తల్లిదండ్రులే తీసుకుందామనుకుంటే డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆ అవకాశాన్ని కూడా మింగేసింది. ఆ అగాథాన్ని గుర్తించిన విద్యావ్యవస్థ పిల్లలకు కథలు చెప్పడాన్ని సిలబస్‌లో చేర్చింది. కానీ ఆ ప్రయత్నం ఇప్పటికీ కార్పొరేట్ స్కూళ్ల దగ్గరే ఉంది. ఒక విషయాన్ని మనసుకు హత్తుకునేటట్లు చెప్పగలిగిన సాధనం కథ. అంతటి ప్రభావవంతమైన సాధనాన్ని చేతులారా జారవిడుచుకుంటున్నామని ఆలోచించిన గీతారామానుజమ్ కథను తిరిగి ఇంటికి తీసుకు రావడానికి కంకణం కట్టుకున్నారు.

ఇంటింటా కథాకారులు

'కథ కంచికి మనం ఇంటికి' అని ముగించే కథను కంచి నుంచి ఇంటికి తీసుకువచ్చే ప్రయత్నం మొదలైంది. కథల భాండాగారానికి పడి ఉన్న పీటముడిని విప్పుతున్నారు గీతారామానుజమ్. ఆమె వృత్తిరీత్యా శాస్త్రీయ గాయని. ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేటర్‌గా అనుభవం ఉంది. రేడియో కార్యక్రమాల నమన్వయ కర్త కూడా. ఆమె 1996లో తోలుబొమ్మలతో పిల్లలకు కథ చెప్పడం మొదలుపెట్టారు. పిల్లలు కథలకు దూరం కావడానికి కారణం నగరాలకు వలసలతోపాటు నానమ్మ– తాతయ్యలకు దూరం కావడం ఒక కారణమైతే, టీవీలు స్మార్ట్ ఫోన్‌లు అంతకంటే ప్రమాదమైన భూమిక పోషిస్తున్నాయంటారామె. కథలను తిరిగి మన జీవితంలోకి తీసుకు రావడానికి బెంగళూరులో కథాలయ ఇంటర్నేషనల్ అకాడెమీ స్థాపించారు. ఆమె క్రమం తప్పకుండా సమావేశాలు, వర్క్‌షాపులు నిర్వహిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ వేడుకలు నిర్వహించి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేసుకున్నారు. గత ఏడాది అరవైకి పైగా కథాకారులతో(కథ చెప్పేవాళ్లు) 'గాథ– ముంబయి ఇంటర్నేషనల్ స్టోరీ టెల్లింగ్ ఫెస్టివల్' నిర్వహించారు. పాతికేళ్ల ప్రయాణంలో ఆమె వేలాదిమంది కథాకారులను తయారు చేశారు. ఒక విషయాన్ని తెలియ చేయడానికి, విన్న వారిలో స్ఫూర్తిని అందించడానికి, ఉత్సాహపరచడానికి, చైతన్యవంతం చేయడానికి ఉపయోగపడే అత్యంత ప్రభావవంతమైన సాధనం కథ. కథ చెప్పేటప్పుడు వినిపించేది గొంతు మాత్రమే. కానీ పలికేది గొంతు మాత్రమే కాదు. కథాకారుల ముఖం భావాలను పలుకుతుంది. గొంతు వాచకంతోపాటు నవరసాలను పలుకుతుంది. అంతకంటే ఎక్కువగా కళ్లు మాట్లాడుతాయి. అందుకే పిల్లలు చిన్నప్పుడు విన్న కథలు వారికి వృద్ధాప్యం వరకు తోడుగా వస్తాయి. వాళ్ల మనుమలకు చెప్పేవరకు మెదడులో నిక్షిప్తమై ఉంటాయి. ఇది దండలో దారంలా పైకి కనిపించని ఒక సంప్రదాయ పరంపర. ఈ పరంపరకు అంతరాయం కలగకూడదు. ఇప్పటికే ఏర్పడిన విరామానికి తెర దించుదాం. కంచికి వెళ్లిపోయిన కథను తిరిగి ఇంటికి తీసుకువద్దాం. 'అనగనగా ఒక రాజు' అంటూ కొత్త కథలను చెబుదాం. ప్రతి ఒక్కరం కథాకారులమవుదాం. పిల్లలున్న ప్రతి ఇంటినీ కథల నిలయంగా మారుద్దాం.



● చిన్నారులకు కథలు చెబుతున్న ట్రైనర్



● ఆసక్తిగా వింటున్న ప్రేక్షకులు